సాక్షి
చిత్తూరు
శనివారం ׀ 25 ׀ మార్చి ׀ 2023



వర్షం
బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెంలో శుక్రవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉక్కపోతతో అవస్థలు పడ్డ జనానికి వర్షం ఉపశమనం కలిగించింది.



టీబీతో ముప్పు
రామకుప్పం: విజలాపురం పీహెచ్‌సీ పరిధి, ఆనిగానూరులో వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



శాస్త్రోక్తంగా చండీహోమం
శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీకాళికాదేవి సన్నిధి వద్ద శుక్రవారం శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. వేదపండితులు కలశ స్థాపన, హోమపూజలు నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం(సా)	సహర్ ఆదివారం(ఉ)
తిరుపతి	6.27	4.54
చిత్తూరు	6.29	4.54
పుంగనూరు	6.31	4.57

న్యూస్‌రీల్

రూ.5లక్షల పరిహారం పంపిణీ



చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు : మండలంలోని ధర్మవరపుపల్లెలో ఫిబ్రవరి 27వ తేదీన పాపిరెడ్డి అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. శుక్రవారం ఈ మేరకు పాపిరెడ్డి కుటుంబానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.5లక్షల పరిహారం అందజేశారు. మృతుడి భార్య అమరావతికి చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఈఈ విజయన్, డీఈ రవికుమార్, ఏఈ ధనుంజయమూర్తి పాల్గొన్నారు.

మరో 5వేల ఇంటి స్థలాలు కేటాయించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నియోజకవర్గానికి అదనంగా 5వేల ఇంటి స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ నగర శివార్లలో భూములను కొనుగోలు చేసి ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం 10వేల ఇంటి స్థలాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, గృహ నిర్మాణశాఖ మంత్రి చొరవ తీసుకోవాలని విన్నవించారు.

ప్రార్థన అనుమతి కోసం ఉద్యోగుల వినతి

చిత్తూరు అర్బన్: రంజాన్ మాసం సందర్భంగా ప్రార్థన చేసుకునేందుకు గంట సమయం కేటాయించేందుకు అనుమతి మంజూరు చేయాలని ముస్లిం ఉద్యోగులు కోరారు. శుక్రవారం ఈ మేరకు ఎస్పీ రిషాంత్ రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి చిన్నారెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ అను, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అక్రమ్ పాల్గొన్నారు.

30న కాణిపాకంలో సీతారాముల కల్యాణం

కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అనుబంధమైన వీరాంజనేయ స్వామి గుడిలో ఈ నెల 30వ తేదీన సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్వామివారి కల్యాణం జరిపించనున్నట్లు వెల్లడించారు.

బోయకొండలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆదివారం రిజిస్ట్రేషన్లకు అవకాశం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయాలు ఈ ఆదివారం పనిచేయనున్నాయి. ఆర్థిక సంవత్సరకం వార్షిక లక్ష్యాల్ని చేరుకోవాలనే ఉద్దేశంతో కార్యాలయాలు పనిచేయాలని రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనివేళలు ఉంటాయని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు వెల్లడించారు.

విజయచిహ్నాలు



జన్మభూమి రుణం తీర్చుకునేలా పౌరుషాన్ని చాటి చరిత్ర పుటలకెక్కిన వీరగాళ్లు.. ప్రజారక్షణకు జీవితాలను అంకితం చేసిన త్యాగధనులు.. శత్రుమూకలను హతమార్చిన పోరాట యోధులు.. క్రూరమృగాలు.. ప్రకృతి విపత్తుల నుంచి జనాలను కాపాడేందుకు ప్రాణాలొడ్డిన ధీరులు.. అపరమిత బలపరాక్రమాలను ప్రదర్శించిన మహావీరులు.. శతాబ్దాల కిందటి వారి ఘనకీర్తిని చాటుతూ ఇప్పటికీ పలుచోట్ల రాతిబండలపై వీరగళ్లుగా దర్శనమిస్తున్నారు. వారు సాధించిన విజయాలకు సూచికగా పలు చిత్రాల రూపంలో ఉత్తేజం నింపుతున్నారు. శిలలపై బొమ్మలుగా నేటికీ స్ఫూర్తినిస్తున్నారు.





వీరమరణం పొందిన భర్తతో సహగమనం చేస్తున్న సతీమణుల చిత్రాలు

- చరిత్రకెక్కిన ధీరులు.. వీరగాళ్లు
- ఘనతను చాటేలా వందలాది రాతి బొమ్మలు
- నాటి పౌరుషానికి సజీవ సాక్ష్యాలుగా ప్రతిమలు
- పరిరక్షణకు చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు

పలమనేరు : మనుషుల ప్రాణాలను రక్షించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధులే వీరగాళ్లు. చరిత్రలో మరుగున పడిన ఈ వీరుల ఘనతను చాటుతూ పలు రాతి బొమ్మలు పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో కనిపిస్తున్నాయి. అప్పటి రాజుల కాలంలో శత్రువులు, బందిపోట్లు, క్రూరమృగాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను కాపాడిన రియల్ హీరోలే వీరగాళ్లు. వీరు ప్రదర్శించిన ధీరత్వానికి గుర్తుగా రాజులు, ఆ ప్రాంత ప్రజలు ఆయా ఘటనాస్థలాల్లోనే బండలపై వీరగాళ్ల ప్రతిమలు చెక్కి కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

వివిధ రూపాల్లో..

ఈ ప్రాంతంలోని రాతిబొమ్మలు, శాసనాలను పరిశీలిస్తే వీరగాళ్లు వివిధ రూపాల్లో కనిపిస్తారు. శత్రువులపై పోరాడి గెలిచినవారు, దొంగల బారినుంచి గ్రామాన్ని కాపాడినవారు, ప్రకృతి విపత్తులనుంచి జనాలను రక్షించినవారు. పశువులమందను లూటీచేసేవారిని హతమార్చిన వీరగాళ్ల బొమ్మలు ఉన్నాయి. అలాగే వీరమరణం పొందిన భర్తతోపాటు సహగమనం చేసుకున్న సతీమణుల చిత్రాలు సైతం బండలపై చెక్కబడి ఉన్నాయి. నాటి వీరులు ఉపయోగించిన త్రిశూలం, అప్పటి గ్రామదేవతలు, పులి, సింహం లాంటి క్రూరమృగాల చిత్రాలు ఈ బండలపై కనిపిస్తున్నాయి. ఎక్కడైతే వీరగాళ్లు వీరమరణం పొందారో అక్కడే వీరి విజయచిహ్నాలను తీర్చిదిద్దినట్లు రాతి శిల్పాలను పరిశీలిస్తే అర్థమవుతోంది.

మద్రాసు ఎపిగ్రాఫికల్ రిపోర్టులో చరిత్ర భద్రం

పలమనేరు, పుంగనూరు, కర్ణాటకలోని ముళబాగిళ్ అప్పట్లో ఒక్కటిగా ఉండేవని చారిత్రక ఆధారాలున్నాయి. ఆధారంగా తెలుస్తోంది. ఈ ప్రాంతాన్ని నోలంబ పల్లవులు, నోలంబులు, వైదంబులు, విజయనగరరాజులు ఆపై గంగరాజులు పాలించినట్టు పేర్కొనబడి ఉంది. అనంతరం రాజప్రతినిధులు, పాళేగాళ్లు, జమీందార్లు, మనేగార్ల పాలన సాగింది. ఈ ప్రాంతంలోని పురాతన గ్రామాలకు సంబంధించిన చరిత్ర మద్రాసు ఎపిగ్రాఫికల్ రిపోర్టులో ముద్రింపబడిఉంది. ఆ మేరకు ప్రస్తుతం వీరగాళ్ల రాతిప్రతిమలున్న దండపల్లెని మహామండలేశ్వరులు పాలించారు. నాటి రాగి శాసనాల్లో త్రయంభక అనే సంతకం ఉండడంతో క్రీ.శ 1410లో రాయలవంశస్తుడైన రాజు విజయభూపతి పాలన ఉన్నట్టు తెలుస్తోంది. దీన్ని అప్పట్లో ముళబాగిళ్ పరగణ, పులినాడు మహామండలంలోని క్రియాశక్తి పురం (నేటి దండపల్లె)గా ఉంది. నాటి రాజులిచ్చిన ఇనాము భూముల వివరాలు సైతం కొందరు మనేగార్ల వద్ద ఉన్నట్టు తెలుస్తోంది. నాటి చరిత్రకు సాక్ష్యాలుగా ఈ గ్రామంలో పురాతన రామేశ్వరాలయం, లక్ష్మీనారాయణ ఆలయాలున్నాయి. ముళబాగిళ్ పరగణాలో సుమారు 500 గ్రామాలు వుండేవని వీటికి సంబంధించిన చరిత్ర సైతం తామ్రపత్రాలలో ఉంది.



పలమనేరు మున్సిపల్ పార్కులో..

ఈ ప్రాంతంలో రాతి ప్రతిమలు ఎక్కడంటే?

పలమనేరు నియోజకవర్గంలోని దండపల్లె, నిడిగుంట, శివాడి, కలగటూరు, నేలపల్లె, కరసనపల్లె, ముత్తుకూరు, కొళత్తూరు, చదళ్ల, చలమంగళం, లద్దిగం, బూడిదపల్లె, పెనుగొలకలలో ఉన్నాయి. పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు,ఉప్పరపల్లె, మంగళం, బోడినాయునిపల్లె, బూదిదపల్లె, మినికి, సూరకుంట, రామసముద్రంతో పాటు కర్ణటకలోని ఎంబాడి, ఊలపాడు, నంగిళి, నగవార తదితర గ్రామాల్లో కనిపిస్తున్నాయి. కర్ణాటకలోని కొన్ని గ్రామాల్లో వీరగాళ్లకు అప్పట్లోనే ఆలయాలను సైతం నిర్మించారు. అవి ఇప్పుడు శిథిలావస్థకు చేరి కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని వీరగాళ్ల రాతిబొమ్మలను పురావస్తుశాఖ ఆధీనంలోకి తీసుకొని కాపాడాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. దీంతోపాటు వీటి చరిత్రను ద్రవిడ విశ్వవిద్యాలయ తెలుగు పరిశోధన విభాగం పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచిస్తున్నారు.




గంగవరం మండలం దండపల్లె వద్ద పులిని వేటాడుతున్నట్టు వీరగాళ్ల బొమ్మ



నాటి చరిత్రను తెలిపే తామ్రపత్రాలు

కాపాడుకోవడం మన బాధ్యత



ఈ ప్రాంతంలో వీరగాళ్ల రాతిబొమ్మలు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటికి సంబంధించిన చరిత్రను శాసనాలు, తామ్ర పత్రాల ద్వారా పరిశోధిస్తున్నా. చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలిన రాతి బొమ్మలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ మేరకు పురావస్తుశాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

– మునిరత్నంరెడ్డి, చరిత్ర పరిశోధకుడు, బత్తలపల్లె

గుప్తనిధుల కోసం..



మా పొలం పక్కనే చాలా వీరగాళ్ల ప్రతిమలు ఉన్నాయి. కొన్నింటిని గుప్తనిధుల కోసం కొందరు తవ్వేసి ధ్వంసం చేసేశారు. వీటి గురించి ఇప్పటివారికి పెద్దగా తెలియదు. ఏవో రాళ్లని పట్టించుకోవడం లేదు. పురాతన రాతి బొమ్మల చరిత్ర భావి తరాలకు అందించాల్సిన అవసరముంది. వీటిని పకడ్బందీగా రక్షించుకోవాలి.

– శ్రీనివాసులు, దండపల్లె, గంగవరం మండలం

వ్యవసాయరంగానికే తొలి ప్రాధాన్యం





సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, హాజరైన రైతులు, అధికారులు

సాక్షి, చిత్తూరు : వ్యవసాయరంగానికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ పి.రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో వారు మాట్లాడారు. రైతు ఇంటి ముంగిటకే సేవలందించేందుకు ఆర్‌బీకేలను ప్రారంభించినట్లు వెల్లడించారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు సుమారు 13 లక్షలకు పైగా మామిడి కాయలకు కవర్లు మంజూరు చేశామన్నారు. ఇంకా కవర్లు కావాల్సిన వారు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. సభ్యుల కోరిక మేరకు మామిడి పంటకు బీమా సౌకర్యం కల్పించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు.జేసీ వెంకటేశ్వర్ మాట్లాడుతూ మామిడి సాగు, దిగుబడి సంబంధింత అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వారం రోజులుగా కురుస్తున్న వడగండ్ల వాన కారణంగా ఏర్పడిన పంట నష్టంపై అంచనాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. సభ్యుడు సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సీజన్‌కు ముందే తూనికలు కొలతల యంత్రాలను అధికారులు తనిఖీ చేయాలని కోరారు.

డీసీసీబీలో విరివిగా రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ

చిత్తూరు అగ్రికల్చర్: సహకార బ్యాంకుల ద్వారా రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ తెలిపారు. శుక్రవారం చిత్తూరులో బ్యాంకు మహాజన సభ నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం వాటా ధనం, పెట్టుబడులు, డిపాజిట్ల ప్రగతిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సహకార బ్యాంకుల ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక, స్వల, వ్యవసాయేతర రుణాల వాయిదాలు చెల్లించని వారికి ఈనెలాఖరులోపు రెన్యూవల్ చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయాలను తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు బ్రహ్మానందరెడ్డి, కృష్ణమూర్తి, సీఈఓ మనోహర్ గౌడ్ పాల్గొన్నారు.

రాణీమహల్ స్థితిగతుల పరిశీలన



మహల్‌ను పరిశీలిస్తున్న డీఈజీ విజయేంద్రరావు

కార్వేటినగరం : పురావస్తుశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం కార్వేటినగరంలోని రాణీమహల్(అద్దాలమేడ)ను డీఈఓ విజయేంద్రరావు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రాణీ మహల్ అభివృద్ధిపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పురావస్తుశాఖ రంగంలోకి దిగిందని తెలిపారు. అందులో భాగంగానే మహల్ స్థితిగతులను పరిశీలించాలని కోరిందని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, ప్రధానోపాధ్యాయని వైవీ వసుమతీదేవీ, ఎంపీడీఓ మోహన్‌మురళి, కో–ఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఏఈ నాగభూషణం, సీఆర్పీ కార్తీకరాయన్ పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌గా పుంగనూరు

- ముఖ్యమంత్రి సహకారంతో అభివృద్ధి
- 2వేల ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి



సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేదికపై ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప తదితరులు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, కంపెనీ ఎండీ కేజ్రీవాల్

పుంగనూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పుంగనూరును ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఇందుకోసం 2వేల ఎకరాలను కేటాయించేందుకు నివేదిక పంపినట్లు వెల్లడించారు. శుక్రవారం మండలంలోని ఆరడిగుంట వద్ద ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ వారి పైపుల ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్పతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రూ.160కోట్ల వ్యయంతో 56 ఎకరాల్లో పైపుల ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నారన్నారు. 500 మందికి ప్రత్యక్షంగా, 800 మందికి పరోక్షంగా ఉపాధి లభించనున్నట్లు తెలిపారు. పరిశ్రమ కోసం ప్రత్యేకంగా 133 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేశామన్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఒక్క ఇంధనశాఖకు మాత్రమే రూ.9లక్షల కోట్లకు ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించారు. గతంలో చంద్రబాబు ఎవరో అనామకులను తీసుకువచ్చి ఎంఓయూలు చేయించి పంపేశారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు దేశంలోనే దిగ్గజ పారిశ్రామిక వేత్తలైన ముఖేష్ అంబానీ లాంటి వారు సమ్మిట్‌కు హాజరై రూ.13లక్షల కోట్ల పెట్టుబడులకు హామీ ఇవ్వడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు నిదర్శనమని కొనియాడారు.

ప్రజలకే జవాబుదారీ..

అభివృద్ధిపై ప్రజలకే జవాబుదారీగా ఉంటామని, సోషల్ మీడియాలో విమర్శలు చేసేవారిని పట్టించుకునే ప్రసక్తే లేదని ఎంపీ పెద్దిరెడి మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. పైపుల పరిశ్రమ భూమి పూజ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా నీటి సమస్యలు తలెత్తకుండా నేతిగుట్లపల్లె, ఆవులపల్లెలో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే హంద్రీ–నీవా కాలువ విస్తరణతోపాటు గాలేరు నుంచి నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో పరిశ్రమలకు స్వర్గధామంగా పుంగనూరు వర్ధిల్లుతుందని తెలిపారు. ఈ క్రమంలోనే పుంగనూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఫ్యాక్టరీ ఎండీ కేజ్రీవాల్‌ను మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి , ఎంపీపీ అక్కి సాని భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాయలసీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జి ఫకృద్దీన్ షరీఫ్, సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ సభ్యుడు నంజుండప్ప పాల్గొన్నారు.

నేడు మూడో విడత ఆసరా

- మొత్తం 3.10 లక్షల మందికి లబ్ధి
- అక్కచెల్లెమ్మల ఖాతాల్లో, రూ. 324.27 కోట్లు

చిత్తూరు అగ్రికల్చర్/ చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ ఆసరా పథకం కింద శనివారం మూడో విడత ఆర్థిక సాయం అందించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,10,327 మంది డ్వాక్రా మహిళలకు రూ. 324.27 కోట్లు జమ చేయనున్నారు. అందులో గ్రామీణ ప్రాంతాల్లోని 2,70,485 మంది లబ్ధిదారులకు రూ. 283.99 కోట్లు, అర్బన్ ప్రాంతాల్లోని 39,842 మందికి రూ. 40.28 కోట్లు అందించనున్నారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారన్నారు. చిత్తూరులో నిర్వహించే జిల్లాస్థాయి కార్యక్రమానికి మంత్రులు, ఎంపీ, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

పకడ్బందీగా పది పరీక్షలు



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎలాంటి తప్పులకు తావు లేకుండా పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. శుక్రవారం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లు, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో పాటించాల్సిన నిబంధనలపై మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో జరిగిన రెండు సంఘటనలు పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. పరీక్ష ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయిన తర్వాత జవాబు పత్రాలను నిర్దేశిత ప్రాంతంలో అప్పగించేంత వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షల నిర్వహణలో చిన్న తప్పు జరిగినా శాఖాపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వర్తించే ప్రతి టీచర్ వద్ద సెల్‌ఫోన్ ఉందా అనే విషయాన్ని పరిశీలించిన తర్వాతే మిగిలిన పనులు చూడాలన్నారు. డీఈవో విజయేంద్రరావు మాట్లాడుతూ రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భయాందోళనకు లోనుకాకుండా పరీక్షా విధానంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రశ్న పత్రాల బండిల్స్ ఓపెన్ చేయడం, ఇన్విజిలేటర్స్‌కు అందించడం తదితర అంశాలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు.

నాడు– నేడు పనులు వేగవంతం


జిల్లా వ్యాప్తంగా నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం నాడు–నేడు పనుల పురోగతిపై నాగయ్యకళాక్షేత్రంలో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పనుల నిర్వహణలో అలసత్వం చూపకూడదని తెలిపారు. సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాకు నాడు–నేడు కింద రూ.41 కోట్లు నిధులు విడుదలైనట్లు తెలిపారు. పలమనేరు బాలికల పాఠశాలకు రూ.24 లక్షలు వచ్చాయని వెల్లడించారు. విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంఈఓలు నాడు–నేడు పనులను తనిఖీ చేయాలని ఆదేశించారు.

చిరుత సంచారంపై ఆందోళన

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని గొర్రెల ఫామ్ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం రాత్రి రాచరంగయ్యగారి పల్లె వద్ద దూది శంకర్ అనే వ్యక్తి మామిడి తోటలో చిరుతపులి తిరుగుతున్న స్థానిక రైతులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ చిరుత సంచారం నిజమేనని, రైతులు ఒంటరిగా పొలాల్లోకి వెళ్లకూడని, అటవీ ప్రాంతాల్లోకి పశువులు తీసుకెళ్లకూడదని హెచ్చరించారు. త్వరలోనే చిరుతను బంధించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్?

- నేడో, రేపో వెల్లడించనున్న పోలీసులు



పలమనేరు : దారి దోపిడీలు, తాళం వేసిన ఇళ్లలో చోరీలు, లారీలను ఆపి డ్రైవర్లను అతి కిరాతకంగా హత్య చేసి వాహనంతో ఉడాయించడం తదితర నేరాలతో కరడుగట్టిన దొంగలను పలమనేరు, గంగవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ ముఠా మన రాష్ట్రంతోపాటు మరో మూడు రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ గ్యాంగ్‌లో పలమనేరులోని ని గంటావూరు కాలనీకి చెందిన ఓ లారీ డ్రైవర్ కీలకంగా ఉన్నట్లు సమాచారం. సుమారు నెల నుంచి రాత్రిబవళ్లు నిఘా పెట్టిన ఐడీ, క్రైమ్ పార్టీ పోలీసులు ఎట్టకేలకు కిరాతక ముఠాను అరెస్ట్ చేసినట్లు తెలిసింది.

వి.కోట చోరీ కేసు ద్వారా...

నెల క్రితం వి.కోటలోని ఓ కుటుంబం బెంగళూరు వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఇంట్లో చొరబడి 150 గ్రాముల బంగారంతో పాటు రూ.3లక్షల నగదును అపహరించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఈ అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్నట్టు తెలుస్తోంది. విచారణలో జిల్లాలోని పాలసముద్రం, చిత్తూరు, నగరి తదితర ప్రాంతాల్లో జరిగిన చోరీలకు వీరే కారణమని తెలినట్టు సమాచారం.

నరహంతక ముఠాలో సభ్యుడే కీలకం?

గతంలో పలమనేరు సమీపంలోని గుండుగల్లు శ్రీరాములు నరహంతక ముఠా నెల్లూరు, ప్రకాశంజిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఖరీదైన సరుకుతో వెళుతున్న లారీలను టార్గెట్‌చేసి డ్రైవర్లను చంపేవారు. మృతదేహాలను వేరే ప్రాంతంలో పాతిపెట్టేవారు. ఈ ముఠాను గతంలో పోలీసులు పట్టుకున్నారు. ఇదే ముఠాలోని గుండుగల్లు శ్రీరాములు శిష్యుడు మున్సిపాలిటీలోని గంటావూరు కాలనీకి చెందిన శివ(35) అని తెలుస్తోంది. లారీ డ్రైవర్‌గా ఉన్న శివ ప్రస్తుతం లారీ యజమానిగా మారాడు. అయినప్పటికీ అంతర్రాష్ట్ర నిందితులతో కలసి గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి కొంతకాలంగా దారిదోపిడీలు, ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నట్టు సమాచారం.

నేడో, రేపో అరెస్ట్ చూపనున్న పోలీసులు

ఈ ముఠాలోని ఏడుగురు నిందితులు, వారు నేరాలకు ఉపయోగించిన కార్లు, రూ.కోటిదాకా రికవరీతో నేడో రేపో నిందితుల అరెస్ట్ చూపనున్నట్టు తెలుస్తోంది. ఈ ముఠా చిక్కడంతో నాలుగు రాష్ట్రాల్లోని పలు చోరీలకు సంబంధించిన విలువైన సమాచారం పోలీసులకు దొరికింది. దీని ద్వారా చాలా కేసులు పరిష్కారం కానున్నాయి. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా అంతర్రాష్ట్ర ముఠాను అదుపులోకి తీసుకున్న మాట వాస్తవమేనని, చిత్తూరులో ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడించనున్నట్లు తెలిపారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.55,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72.00

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	24
తిరుపతి	36	25
తిరుమల	31	21
గూడూరు	36	26
నగరి	36	26

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్


క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

యాదమరి: ఉపాధి కూలీల సొమ్ము స్వాహా చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ సౌందర్యను సస్పెండ్ చేసినట్లు పీడీ గంగాభవానీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ×ఉపాధిలో ఎవరు అపరాధి?* శీర్షికతో సాక్షి పత్రికలో వెలువడిన కథనం మేరకు విచారణ చేపట్టామన్నారు. ఎంపీడీఓ శివరాజ్, ఉపాధి ఏపీడీ సుబ్రమణ్యం క్షేత్రస్థాయిలో విచారించి ఫీల్డ్ అసిస్టెంట్ రూ.35వేలు స్వాహా చేసినట్లు గుర్తించారన్నారు. ఈ మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు వేశామని, బిల్లుల మంజూరుకు సహకరించిన ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్‌పై విచారణ చేపట్టినట్లు వివరించారు.

ఘనంగా 'పీఈఎస్' స్నాతకోత్సవం

గుడుపల్లె : స్థానిక పీఈఎస్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం 15వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి మాట్లాడుతూ విలువతో కూడిన వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు. నాణ్యమైన వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ముఖ్యఅతిథి, ప్రముఖ సర్జన్ వివేక్ గావలి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుతీసుకురావాలని కోరారు. అనంతరం 150 మంది విద్యార్థులకు వైద్య పట్టాలు పంపిణీ చేశారు. 65 మందికి పీజీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ రూపా సురేష్, ప్రిన్సిపల్ కృష్ణారావు, సూపరింటెండెంట్ చెన్నబసవపాటిల్ పాల్గొన్నారు.


విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న దృశ్యం

అండర్-17 జిల్లా స్థాయి చెస్ పోటీలు రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 26వ తేదీన గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలల నిర్వహించనున్నారు. ఆ మేరకు చీఫ్ ఆర్బిటర్ శ్రీనివాస్ సూరి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన బాలబాలికలను రాష్ట్ర స్థాయి అండర్-17 ఫెడ్ రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 2006, జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని, పాల్గొనదలచిన వారు ×డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీసీహెచ్‌ఈఎస్ఎస్.ఓఆర్‌జీ* వెబ్‌సైట్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 98852 38474 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

గంజాయి తరలిస్తున్న టీటీడీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అరెస్ట్

తిరుమల : తిరుమలకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న టీటీడీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని తిరుమల ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తిరుపతికి చెందిన జి.గంగాద్రి తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని లగేజీ కౌంటర్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఇతను ఉదయం తిరుపతిలోని అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఓ బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్‌ఈబీ అధికారులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద 15 ప్యాకెట్లలలో నింపిన 150 గ్రాముల గంజాయి పట్టుబడింది. వెంటనే అతడిని స్టేషన్‌కు తరలించిన విచారణ ప్రారంభించారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం


సూచనలిస్తున్న జిల్లా సెబ్ ఆఫీసర్ శ్రీలక్ష్మి

పలమనేరు: కర్ణాటక నుంచి అక్రమంగా తరలివస్తున్న మద్యంపై ఉక్కు పాదం మోపాలని అడిషనల్ సూపరిండెంటెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా సెబ్ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. పట్టణంలోని సెబ్ స్టేషన్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ చెక్‌పోస్టు, రాష్ట్ర సరిహద్దులోని బార్డర్ చెక్‌పోస్టును సందర్శించారు. అక్కడున్న అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. స్థానిక సెబ్ సీఐ ఎల్లయ్య, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మేధో హక్కుల రక్షణ అవసరం


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మేధావులు, విద్యావేత్తలు

చిత్తూరు కలెక్టరేట్ : మేధో సంపత్తి హక్కులను రక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చిత్తూరులోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల, న్యూఢిల్లీకి చెందిన ఎసీఎస్ఎస్ఆర్ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, కో-ఆర్డినేటర్ ఉషశ్రీ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ముఖ్యఅతిథి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో వినూత్నమైన అంశంతో జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎసీఎస్ఎస్ఆర్ ఎటువంటి సదస్సులకు ఆర్థిక సహాయం అందిస్తుంది, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలనే అంశాలను వివరించారు. మైసూర్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ నిరంజన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మేధావులు, విద్యావేత్తలు హక్కుల పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. అనంతరం జాతీయ సదస్సు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉషారాణి, రుక్మిణి, సురేఖ, తిరుకుమరన్, రమాదేవి, కిరణ్మయి, ఆనంద్ పాల్గొన్నారు.

టమాటా గ్రేడింగ్ యంత్రం పరిశీలన


టమాట గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణంలోని వ్యవసాయమార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన టమాట గ్రేడింగ్ యంత్రాన్ని సంయుక్త పరిశీలన బృందం శుక్రవారం పరిశీలించింది. సరుకు గ్రేడింగ్‌కు ట్రయల్‌రన్ చేపట్టింది. సభ్యులు మాట్లాడుతూ ఈ యంత్రం ద్వారా సైజుల వారీగా టమాటాలను బాక్సుల్లో నింపవచ్చన్నారు. బృందంలో కడప సంయుక్త మార్కెటింగ్ సంచాలకుడు రామాంజనేయులు, ఈఈ నసీం, డాట్ ఎంఏ వెంకటేశ్వర్‌రావు, డీఈ పరమేశ్వరన్, హరినారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, సెక్రటరీ సంజీవకుమార్ పాల్గొన్నారు.

ఆర్సీకే రాజుకు 'కీర్తి పురస్కారం'



పుత్తూరు రూరల్: తిరుపతికి చెందిన రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజుకు పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ వారు కీర్తిపురస్కారం అందించనున్నారు. హాస్య కథా రచన విభాగంలో విశిష్ట సేవలకు గాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈనెల 28వ తేదీన హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో రూ.5,116 నగదు, పురస్కారపత్రంతో సత్కరించనున్నారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో విశేష సేవలందించిన 44 మంది ప్రముఖులకు ఈ పురస్కారాలను అందించనున్నారు. ఆర్సీకేరాజు హాస్య ప్రధానంగా రచించిన దుశ్శాలువా కప్పంగా, కిష్టడి కతలు, రాజనాల బండ హాస్య కథల పుస్తకాలు మంచి ప్రాచుర్యాన్ని పొందాయి. 39 ఏళ్ల కథా రచయిత ప్రస్థానంలో ఆయన రచించిన చిన్నా, పెద్ద కథలు 450 వరకు వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. 12 కథా సంపుటిలను వెలువరించారు.

వరసిద్ధునికి వెండి ఆభరణాలు



కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి వెండి కిరీటం, పెద్ద విభూది పట్టీని హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసరావు అనే భక్తుడు విరాళంగా అందించారు. ఉదయం దాత కుటుంబ సభ్యులు సుమారు రూ.2లక్షల విలువైన వెండి ఆభరణాలను ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణికి అందజేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.


కిడ్నాప్‌నకు యత్నించిన ముగ్గురి అరెస్ట్

రామకుప్పం: ఓ బాలికను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన కేసులో ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య శుక్రవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని భువనేశ్వరి, ధనుంజయ దంపతులు పిల్లలతో కలసి బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో నివాసముంటున్నారు. వారి కుమార్తె (17) అక్కడే చదువుకుంటోంది. ఈ నేపథ్యంలో రామనగర్ జిల్లా భద్రపురానికి చెందిన నవీన్ ప్రేమ పేరుతో కొంతకాలంగా బాలికను వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు నవీన్‌ను ఎన్నిసార్లు హెచ్చరించినా ఫలితం లేకుండాపోయింది. రెండు రోజుల క్రితం ఆవులకుప్పంలో బంధువుల ఇంట్లో వివాహానికి వచ్చిన బాలికను నవీన్ తన స్నేహితులు శశాంక్, సంతోష్‌తో కారులో వచ్చి కిడ్నాప్ చేశారు. బాలిక కేకలు వేయడంతో గ్రామస్తులు కారును వెంబడించారు. దీంతో బాలికను రోడ్డుపై వదిలేసి కిడ్నాపర్లు వెళ్లిపోయారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కృష్ణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మరోమారు బాలికను కిడ్నాప్ చేయడానికి నవీన్ అతని స్నేహితులతో కలసి ఆవులకుప్పానికి వస్తున్నట్లు బాధిత కుటుంబానికి సమాచారం అందింది. దీంతో పోలీసులు జోగిండ్లు గ్రామం వద్ద నవీన్ అతని స్నేహితులను అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.

అంగన్‌వాడీ నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

బైరెడ్డిపల్లె : మండలంలోని పాతూరునత్తం అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న టీచర్ నిర్మల నిర్లక్ష్య వైఖరిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను ఉంచి తలుపులు, కిటికీలు వేసుకుని వెళ్లిపోవడంపై మండిపడుతున్నారు. చిన్నారులు ఊపిరి ఆడక కేకలు వేయడంతో విషయం తెలిసిందని వెల్లడిస్తున్నారు. దీనిపై సీడీపీఓ మాధవీలతను వివరణ కోరగా, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆటో చోరీ


చోరీకి గురైన ఆటో (ఫైల్)

పలమనేరు : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అక్బర్ అనే వ్యక్తి ఆటోను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిజాయితీ చాటుకున్న పంచాయతీ కార్మికుడు

రేణిగుంట: రేణిగుంట గ్రామ పంచాయతీలో పని చేసే పారిశుద్ధ్య కార్మికుడు శ్రీనివాసులు తనకు దొరికిన నగదును బాధితులకు అందించి నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద తిరుపతికి చెందిన రాజశేఖర్, వర్మ భోజనం ప్యాకెట్ అని భావించి తమ వద్దనున్న రూ.1.39 లక్షల నగదును పంచాయతీ కార్మికుడు శ్రీనివాసులుకు ఇచ్చి వెళ్లిపోయారు. అయితే భోజనం చేసేందుకు కూర్చుని శ్రీనివాసులు కవర్ తెరిచి చూడగా, అందులో నగదు కట్టలు కనిపించాయి. విషయాన్ని పంచాయతీ పారిశుద్ధ్య కార్మిక నాయకుడు సుబ్బరాజుకు తీసుకెళ్లారు. ఆయన సర్పంచ్ నగేషం దృష్టికి తీసుకెళ్లి నగదు పోగొట్టుకున్న వ్యక్తుల వివరాలను కనుక్కొని వారిని పంచాయతీ కార్యాలయానికి పిలిపించి గంట వ్యవధిలోనే అందజేశారు. వారు కార్మికుని నిజాయితీని గుర్తిస్తూ అందులోని రూ.15 వేలను ప్రోత్సాహకంగా అందించారు.


పోగొట్టుకున్న నగదును బాధితులకు అందిస్తున్న రేణిగుంట సర్పంచ్